# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 07-04-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

- ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు.
- గిరిజన ప్రాంతాలలో రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు.
- మంగళగిరి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.
- రాష్ట్రంలో ఆక్వా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు.
- దక్షిణ మధ్య బంగాళాఖాతంలో ఈరోజు అల్పపీడనం ఏర్పడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

==================

ప్రతి నియోజకవర్గంలో 100 నుంచి 300 పడకలు ఉండే ఆసుపత్రులు నెలకొల్పేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు వైద్యం, ఆరోగ్యం, ఆహార విభాగాలలో పురోగతిపై ముఖ్యమంత్రి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పాత్రికేయులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమరావతిలో గ్లోబల్ మెడిసిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజలకు ఆరోగ్యపరమైన అవగాహన ఉండాలని ముఖ్యమంత్రి పేర్కొంటూ..

(వాయిస్ బైట్..32 సెకన్లు)- సెట్

==================

రాష్ట్రంలో ఆక్వా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. ఆక్వా సమస్యలపై మంత్రి అధ్యక్షతన అమరావతిలో ఈరోజు నిర్వహించిన సమావేశంలో ఆక్వా రంగ నిపుణులు, అధికారులు పాల్గొన్నారు. అమెరికా దేశం విధించిన సుంకాలు, ఆక్వా రంగానికి కలిగే ఇబ్బందులపై మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, దేశీయ ఆక్వా ఉత్పత్తులను సద్వినియోగం చేసుకునేలా సాగుదారులకు ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. అదే విధంగా రైతులు, విత్తన ఉత్పత్తిదారులు, నిపుణులు, ఫీడ్ తయారీదారులతో ఒక కమిటీ ఏర్పాటు చేయనున్నామని మంత్రి చెప్పారు.

==================

గిరిజన ప్రాంతాలలో రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని డుంబ్రిగుడలో అడవితల్లి బాట కార్యక్రమాన్ని ఈరోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు అయిన సంవత్సరం లోపే 1,500 కోట్ల

రూపాయల విలువైన పనులను గిరిజన ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కోసం మంజూరు చేశామని తెలిపారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభమవుతాయని పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ...

(వాయిస్ బైట్..30 సెకన్లు)- సెట్

==================

మంగళగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర విద్య, ఐటి శాఖా మంత్రి నారా లోకేష్ తెలిపారు. మనఇల్లు–మన లోకేష్ కార్యక్రమంలో భాగంగా తాడేపల్లి మండలం కొలనుకొండకు చెందిన పేదలకు ఈరోజు ఇళ్ళ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో చేనేత కార్మికులకు క్లస్టర్, స్వర్ణకారుల కోసం జెమ్స్ జ్యుయలరీ పార్కు ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. అదే విధంగా వందపడకల ఆసుపత్రికి ఈనెల 13వ తేదీన శంకుస్థాపన చేస్తామని తెలిపారు. ఇల్లు లేని పేదలందరికీ దశలవారీగా ఇళ్ళ పట్టాలు అందచేస్తామని నారాలోకేష్ పేర్కొన్నారు.

==================

పశ్చిమగోదావరి జిల్లాలో జాతీయ రహదారులను కలుపుతూ సర్వీస్ రోడ్లను అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించామని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చెప్పారు. తాడేపల్లిగూడెంలో ఈరోజు మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, లోసరి నుంచి భీమవరం మీదుగా పిప్పర తాడేపల్లిగూడెం వరకు 100 కోట్ల రూపాయలతో రహదారిని అభివృద్ధి చేయనున్నామని తెలిపారు. అలాగే, ప్రతి నియోజకవర్గంలో డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని కేంద్ర మంత్రి చెప్పారు.

==================

వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయంలో ఈ నెల 11వ తేదీన శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ మంత్రి ఎస్. సవిత తెలిపారు. స్థానిక టిటిడి పరిపాలన సమావేశ మందిరంలో బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవ ఏర్పాట్లపై అధికారులతో ఈరోజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. కళ్యాణోత్సవానికి సంబంధించి అన్ని పనులు పూర్తయ్యాయని చెప్పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి, బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

==================

విరామం

==================

కేంద్ర ప్రభుత్వ పథకాలు నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలతో లబ్ధిపొందుతున్న వారు ఆర్థికంగా నిలదొక్కుకోవడమే కాకుండా తమ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వందలాదిమంది నిరుపేదలకు ఉపాధి లభిస్తోంది. శ్రీకాళహస్తి మండలంలోని తొండమనాడు గ్రామంలో నిరుపేదలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ పథకం ద్వారా తమకు ఎంతో మేలు జరుగుతోందని తొండమనాడు గ్రామస్తురాలు సరోజమ్మ మాట్లాడుతూ...

(వాయిస్ బైట్..29 సెకన్లు)- తిరుపతి జిల్లా

==================

అన్నమయ్య జిల్లాలో ఈరోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో హంద్రీనీవా ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుగాలి రమ మృతి చెందారు. కలెక్టరేట్ లో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో స్పెషల్ కోఆర్డినేటర్ గా విధులకు హాజరయ్యేందుకు పీలేరు నుంచి కారులో ఆమె బయలుదేరారు. మార్గమధ్యంలో సంబేపల్లి సమీపంలో ఉన్న ఎర్రగుంట వద్ద ఎదురుగా వచ్చిన మరో కారు ఢీకొన్న ప్రమాదంలో అక్కడికక్కడే ఆమె మరణించారు. కాగా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మృతిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతాపం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన మరో నలుగురికి అత్యవసర వైద్య చికిత్సలు అందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

===================

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రమైన బాపట్లలో నగరంలోని ప్రభుత్వ మున్సిపల్ హైస్కూల్ నుంచి ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ వెంకట మురళి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో మాతాశిశువు మరణాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మంచి ఆరోగ్యంతోనే ఏమైనా సాధించవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఈ.బి.దేవి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని ఆమె ఈరోజు అనంతపురంలో ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని కొండపల్లి మున్సిపల్ కమిషనర్ బి.రమ్యకీర్తన అన్నారు. బాపట్ల జిల్లా కొండపల్లిలో ఈరోజు నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు.

===================

విశాఖ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ వరాహ లక్ష్మి నరసింహస్వామి వారి వార్షిక కళ్యాణోత్సవం రేపు రాత్రి జరుగుతుందని ఆలయ అధికారులు తెలిపారు. ప్రతీ ఏటా చైత్ర శుద్ధ ఏకాదశి నాడు స్వామి వారి కళ్యాణోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ వస్తోందని పేర్కొన్నారు. భక్తులు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో హాజరవుతారని చెప్పారు.

===================

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పి.జి.అర్.ఎస్.) కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ హాజరుకావాలని అనకాపల్లి జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ ఆదేశించారు. ఈరోజు కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో నిర్వహించిన పి.జి.అర్.ఎస్. కార్యక్రమంలో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్, జాయింటు కలెక్టరు ఎమ్. జాహ్నవి ఇతర అధికారులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.

===================

ఆగ్నేయ బంగాళాఖాతం పరిసర ప్రాంతాలలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తన ప్రభావంతో దక్షిణ మధ్య బంగాళాఖాతంలో ఈ రోజు అల్పపీడనం ఏర్పడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ అల్పపీడనం రేపటికి నైరుతి బంగాళాఖాతం వైపు కదిలే అవకాశం ఉందని వెల్లడించింది. ఆ తరువాత 48 గంటల్లో పశ్చిమ మధ్య బంగాళాఖాత ప్రాంతములో విస్తరించే అవకాశం ఉందని తెలిపింది. ఆ వివరాలను అమరావతిలోని వాతావరణ అధికారి వెల్లడిస్తూ..

(వాయిస్ బైట్..32 సెకన్లు)- అమరావతి వాతావరణ కేంద్రం

===================

===================